
# ఒక వికృతి లోంచి

కాశీభట్ల వేణుగోపాల్



**నల్లటి చీకటి రొచ్చులో పొర్లుతూన్న పందుల్లా ఉన్నాయి మబ్బులు.**

**ఆ పాడుబడిన రైల్వే క్వార్టర్స్ వెనక తలుపు నుంచికింది మురుక్కాలువలోకి ఒకటి రెండు మూడు నాలుగైదుగా ... నశించిపోతున్నాయి మెట్లు.**

**ఆ నాశనానికి పైమెట్టుమీద కూచుని తను ...**

జీవితంలోని శ్రమనూ, ఖేదాన్నీ, స్వేదాన్నీ, కన్నీళ్లనీ పిండేసింతర్వాత మిగిలిన పిప్పి ఆనందంలా ఉన్నాడు.

పాడుబడి, పెంకులూడి, పెచ్చులూడి, చీకిపోయి, చివికిపోయి ఛిద్రమైన ఆ చీకటింటి వెనక తలుపు తెర్చుకు...కింద కుళ్లుకాలువలోకి పతనమైపోతున్న మెట్లమీద ... పై మెట్టుమీద జారుడుతనం. పైమెట్టుమీద కింద కుళ్లులో కలిసిపోతున్న శైథిల్యం మొదలులో తను ...

ఆనందం కోసం హత్య తప్పదు ...

అది నిత్య సత్యం ... ఏది సత్యం? ఏదసత్యం?

"ఎస్! తప్పదు ... తప్పదు!"


అందుకే నేనానందిస్తా హత్య చేసొచ్చా గదా ఒక ఆత్మను ...

తప్పనిసరి ఆనందాన్ని ధరించాలి.

ఆకాశాన్ని చీల్చుకుని బలవంతంగా సగం చంద్రుడు ...మబ్బుల్నించి రాల్తోన్న చినుకుల్ని కావలించుకుని కరిగిన వెన్నెల, మురుక్కాలువలో మెరిసిపోతోంది. మళ్లీ మబ్బుల పందులు సగం చంద్రుణ్ని తొక్కేశాయి. ఆ మూలుగు ఈదురు గాల్తో కలిసి వినిపిస్తోంది.

ఛావు...సగం చంద్రుడా ఛావు! పందులానందిస్తాయి. చీకటానందిస్తుంది. మురుక్కాలువానందిస్తుంది. ముష్టిగాలి ఆనందిస్తుంది. మురికి నేనానందిస్తాను. ఛావు ...సగం చంద్రుడా ...

"డాక్టర్! డాక్టర్!"



"ఎవరు? ఎవరది పిలుస్తున్నారు? నన్నే ... ఎందుకూ? హత్య చేసొచ్చాననా? అమ్మో! ఎలా తప్పించుకోనూ ... ఇక్కడ్నించీ దూకితే సరాసరి మురుక్కాలువలో పడి కశ్మలంలో పడిపోయి కంపు కంపు ... ఛీఃఛిఛిఛీః!"

"డాక్టర్! డాక్టర్!" సీతాపతి.

"హైః..." ఊపిరి పీల్చుకు ... నెమ్మదిగా వినీ వినిపించక అన్నాను.

"హాస్పిటల్‌నించి వెళ్తూ ఇటెందుకో ఆగాను. మీ పాట వినిపించింది. ప్లీజ్ ... కంటిన్యూ !"

నే...నే...ను పాటపాడ్తున్నానా?! ఈ గాడ్దె కొడుకు ...వాడి సైకియాట్రీ ట్రిక్కులన్నీ నామీద వాడుతున్నాడు. అది ఫోన్జేసుంటుంది...ఈ దొంగకొడుకు నన్ను వెదుకుతూ వచ్చుంటాడు. నాకు తెలీదనుకుంటున్నాడేమో ... పిచ్చ నాయాలు! నాకు తెల్సొరే! ఐ టూ హోల్డె డాక్టరేట్!" ... కసిగా అనుకుని జేబుల్తడుముకున్నా సిగరెట్టుకోసం.

గా...ష్! నే...ను లుంగీ బనియన్మీదున్నా. కాళ్లకి సాండల్స్.

"తీసుకోండి." సీతాపతి మార్ల్‌బరో పెట్టె ముందుకు చాచాడు.

నా ప్రమేయం లేకుడానే నా వేళ్లూ, నా నోరూ వేటి పనవి చేసుకుపోతున్నాయి.

మార్ల్‌బరో! ఎందుక్కాల్చావ్రా? మార్ల్‌బరో కాలుస్తావ్? రెడీనైట్ తాగుతావ్? ఎవడ్దో కత్తీ, ఎవడ్దో నెత్తీ ... సంపాదించీ సంపాదించీ చచ్చిపోతా వొరెరేయ్!

"థాంక్స్! భోంచేసి అలా పొద్దుపోక మెల్లిగా ఇలా నడుచుకుంటూ..."

అవునూ ... వీడికెందుకూ ఎక్స్‌ప్లనేషనిస్తున్నా? అప్రయత్నంగా టైం చూసుకున్నా. రెండున్నర తెల్లవారుజాము. వీడు...? వీడు హాస్పిటల్నించీ వస్తున్నాట్ట. మరి నేనున్నదేమిటో 'భోంచేసి ఇలా నడుచుకుంటూ వచ్చానని అన్లా?'

తెలుస్తోంది - సీతాపతీ, నేనూ ఇద్దరం అబద్ధాలాడుకుంటున్నాము. నిజంగానే నాకుపిచ్చా? కాద్లే, వీడే ... ఈ సీతాపతిగాడే దాన్తో అంటం నే విన్లే?

"నో నో నో! నాటెటాల్! స్కిజఫ్రీనియా ఈజె ప్రెటీ బిగ్ వర్డ్ టు యూజ్! హి ఈజ్ సఫరింగ్ ఫ్రమ్ ఎ సార్టాఫ్ కాంప్లెక్సస్ ఆరిన్వాల్డ్ ఇన్దిస్ కేస్! నన్నర్థం చేసుకోండి, మీకు పెద్దగా చెప్పనవసరం లేదు!"

ఎ కాంప్లెక్స్ ఆఫ్ కాంప్లెక్సెస్ ... ఏదో సమ్ డర్టీ సిండ్రోమ్.

ఇంటిముందు కారాపాడు సీతాపతి.

"గుడ్‌నైట్!" అంటూ గేర్ ఛేంజ్ చేశాడు.

"నో ... గుడ్ మార్నింగ్!" పళ్లన్నీ తెరచి కసిగా నవ్వుతూ అన్నా.

నిర్వికారంగా చూసి నవ్వి, "ఎస్, గుడ్ మార్నింగ్!" చీకట్లో కలిసిపోయాడు.

మెల్లిగా దొంగలాగా నా ఇంట్లోకి నేనే ప్రవేశించా. తలుపు తెరిచే ఉంది.

చప్పుడు చేయకుండా మెల్లిగా తలుపు బోల్ట్ చేశా. ఉంది ...! అక్కడే ...! సోఫాలో. కాళ్లు టీపాయ్‌మీద పెట్టుకుని. పక్కన నీలికాంతి పరుపు వెలుగు, రేఖామాత్రంగా రేగిన జుట్టూ, నుదురూ,

**వారం వారం కథాప్రభ**

ముక్కూ, పెదవుల వంపూ, గడ్డం విరుపూ... నల్లటి మేఘం అంచులకు అద్దుకుని మెరిసే అజ్ఞాత కాంతిరేఖలాగా.

ఓహోహో, గొప్ప కవిగాడివిరా నువ్వు! వీళ్లకేం పట్టవ్రా! నువ్వో కవివనీ, నీకో పాటుందనీ, నీవు అద్భుత చిత్రకారుడివనీ ... వీళ్లకొద్దొరే! నా నిశ్శబ్ద శబ్దాలు ఆ చెవులను తాకుతున్నాయని తెలుసు.

సోఫా వెనక్కి చేరి ముందుకొంగి చూశా.

"దయచేసి ఇప్పుడేనా పడుకోండి తెల్లవారు జాము మూడైంది!" కదలకుండా అలాగే కూచుని అందామె.

"ఇప్పుడానందంగా ఉందా? ఊళ్లో ప్రతీ గాడ్దె కొడుక్కీ తెలుస్తుంది కదా నేనెంత నిన్ను హింసిస్తున్నానో! నువ్వు అపర భూదేవిగాలా మహా సహనంతో కష్టాల్నీ, కన్నీళ్లనీ కడుపులో దాచుకుని పాపం...నాలాంటి పిశాచిగాడితో అపర వికృతుడితో ఎంతెంత కష్టాలు పడుతున్నావో!" పళ్లన్నీ తెరచి కసిగా నవ్వుతూ అన్నా.

"ప్లీజ్! వద్దు, దయచేసి వెళ్లి పడుకోండి!" ఎట్లాంటి భావమూ లేదేం? ఏడవచ్చుగా? కళ్లసలు తడి కూడా కాలేదే? వెళ్లేప్పుడు మొహంమ్మీద ఊసి వెళ్లాగా, సిగ్గుతో ఏడవదేం?!

దగ్గరగా వెళ్లి నిలుచున్నా. సరిగ్గా నా ఎత్తుందామె. అయిదూమూడు. ఆమెలోంచీ నేనింత వరకూ గుర్తించలేని పరిమళం ఉధృతంగా రేగుతోంది. ఆమెన్చూస్తే అన్నమయ్య పువ్వుల పాట గుర్తొస్తుంది.

"పువ్వుమీద రెండు పువ్వులు. పువ్వుల మధ్యనో పువ్వు ... పువ్వు కింద ముప్పై ..." వద్దూ ... వద్దూ ... నో రొమాంటిసిసమ్."

"పాథటిగ్గా ... సారోపుల్గా ... జీవితం రసహీనంగా కనబడ్తోందా మల్లికాదేవిగారూ?" కళ్లల్లో కళ్లు పెట్టి గుచ్చి చూస్తు అన్నా పువ్వుమీది రెండు పువ్వుల్వికసించి ... హాః.

ఆమె కదలబోయింది నా ముందునుంచీ.

ఒడిసిపట్టుకున్నా. నా చేయి వణుకుతోందేం? ఇంత బలహీనంగా ఉన్నానేం? అయినాసరే బలంగా పట్టుకున్నా. రవికె చేతికింద మోచేతిమీద నగ్నంగా ఉన్న సున్నితమైన చర్మాన్ని కసిగా నలిపా.

"అమ్మా!"

హాః... ఏడ్పు. ఏడ్పు అందమా! మనస్సు లేకపోతేనేం శరీరముందిగా ఏడ్పు! బొటనవేలూ, చూపుడువేలూ మధ్య ఆమె చర్మం పిగిలిపోయేట్టుగా కసిగా ...

"ప్లీజ్ ... వద్దు! అమ్...మ్...మ్మా...!" గింజుకుంటోంది.

గేలానికి వేలాడుతున్న రంగురంగుల చేప చెముక్కులు , తెల్ల పావురాయిమీద కసాయి చేయి.


"వాడ్నెందుకు పంపించావ్ ... గాడ్దెకొడుకు రేప్పొద్దున్న క్లబ్బులో అందర్తోటీ వాగుతాడు. నన్ను పిచ్చోడ్ని చేసి చూపించేందుకే కదా ఈ నీ ఆటలు... చెప్పు, వాడ్నెందుకు పంపించావ్?"

నా పట్టునుంచి తప్పించుకుంది. సోఫాలో వొదిగి మూల కూచుంది. లేదులేదన్నట్టుగా తలాడిస్తోంది.

లేదన్నట్టుగానా? వద్దన్నట్టుగానా? వద్దేనేమో ... హింసించొద్దనేమో ... లోపలెందుకు హాయిగా ఉంది నాకు. ఎరోటిగ్గా ఉంది. ఎస్ ... ఎరోటిక్! ఆమె చర్మాన్ని నలిపిన వేళ్లని వాసన చూసుకున్నా అప్రయత్నంగా.

తోడేలు ... మానసం ...

వేళ్లు సిగరెట్ కంపుకొడ్తున్నాయి. ఛీ! ఛీ...ఛిఛి...



## సౌందర్యం కోసం బాదాం

**కొం**దరి ముఖాలపై మొటిమల తాలూకు మచ్చలేగాక వేరే మచ్చలుకూడా ఏర్పడి ముఖ సౌందర్యాన్ని దెబ్బతీస్తాయి. అలాంటి వారు ఈ పాక్‌ను వేసుకుని ప్రయత్నించవచ్చు.

ఓ చారెడు బాదంపప్పులు , కాసిని బియ్యం, కాసిన్ని గసగసాలు కలిపి పొడి చేసుకొని పెట్టుకోవాలి. ఆపొడిలో కాస్త తేనె, పెరుగు వేసుకుని ముఖానికి పాక్‌వేసుకుని పదినిముషాల తరువాత శుభ్రంగా కడిగివేయండి. కొన్ని రోజులపాటు రోజూ ఈ పాక్ వేసుకుని ప్రయత్నించి చూడండి.. మచ్చలు పోయి చర్మం కాంతిమంతంగా మారుతుంది.

మధూలిక

ఛీ!

దీన్దగ్గర మంచి వాసనొస్తోందేం మరి? ఆ వాసన తగల్లేదేం? నా చేయికి అంటుకోలేదేం? మల్లెపువ్వున్నలిపితే పసరు పురుగు వాసనొస్తోదేం?

నరాల రహదారుల్లో లూటీలూ, దోపిడీలూ దహనకాండలు ... మంటలు మంటలు ... మహోద గ్రజ్వాలలు ... కసికసిగా అదుపు తప్పిన నిధువ నాగ్ని జ్వాలకీలలు రేగి రేగి ...

చూడూ చూడూ వాణ్ణి చూడూ చిత్తకార్తె కుక్కలా లేడూ! అదుగో జొల్లు కారుస్తున్నాడూ చూడు చూడూ .. అరే! ఇదిగో ఇక్కడా ... వీడే ... చూడూ ... చూడూ ... వీడే వీడే గుసగుసలుగా ... ఎవరు? ఎవరది?

పడకగది తెర గాలికి రెపరెపలాడ్తోంది. లోపలికి వెళ్లేప్పుడల్లా తలుపు పక్కనే ఉన్న 'హైబాయ్'కి రాచుకుని వెళ్తోంది. హైబాయ్ డ్రావర్‌కున్న హేండిల్ కర్టెన్ని తగుల్కొని లాక్కున్నప్పుడల్లా 'డూఁవ్ ... డూఁవ్...' అనే శబ్దం చేస్తోంది.

నో! హాల్యూసినేషన్ కాదు. యిల్యూషన్ ... నో నో నో ! అయ్ ఆమ్ట్ పారనాయిడ్ ... కాదు, కాదు.. లేదు లేదు.

మూలకొదిగి సోఫాలో భయంభయంగా చూస్తోన్న మల్లిక ... ఛీఁ ... ఏమవుతోంది నాకు? ఈ...ఈ మల్లికనా ఇట్లా హింసిస్తున్నా? పువ్వులాగా జాలిగా, గువ్వలాగా అసహాయంగా నామీద కురిసిన మానవత్వం ...

"సారీ ...సా...రీ... అయామ్ రియల్లీ సా..రీ...! నాకు తెల్సు నాకేమీ కావటంలేదు. కానీ ఏదో అవుతున్నా. జస్ట్ ఎమోషనల్లీ అప్సెట్. దట్సాల్! సారీ ... ప్లీజ్ ... ఫర్‌గివ్మీ!" ఏదో అజ్ఞాత శక్తి నాలోని మిగిలిన కొద్ది ప్రాణనూ పీల్చివేసింది. మండుతున్న మిడిగుడ్ల చుట్టూ చెమ్మ ఊరుతుండగా కుప్పకూలిపోయా అట్లాగే ఆమె ముందు. సోఫాకింద ఆమె కాళ్ల దగ్గర కూచున్నా. నా తల కాళ్లు ముడుచున్న ఆమె ఎడమపాదం మీద ఉంది సరిగ్గా, హాయిగా ఉంది. చల్లగా ... "ఇట్స్ ... ఇట్సాల్రైట్ ..." వినీవినబడక శబ్దించీ శబ్దించక మల్లిక ... తాకొచ్చు కదా? అట్లా చల్లగా తలమీద చెయ్యి వేసి నా వెంట్రుకల్లో వేళ్లు జొనిపి నన్ను లాలించొచ్చుకదా?

వెంట్రుకలు ...? నీ బోడి నెత్తిమీద! బట్టతల వెధవా!

కమ్చీ... 'చెళ్...!'

కాటరీ ...'చుర్ర్ర్...!"

మెల్లిగా మెలమెల్లగా తలెత్తి చూశాను.

ఎస్ ... సూటిగా నా నడినెత్తిమీదున్నాయి మల్లిక చూపులు. ఆ చిరు వెల్తుల్లో విచిత్రంగా మెరుస్తుంటోందా నా బట్టతల?

ఏమిటిది? క్షణమొరీతిగా ఆలోచిస్తున్నా దేనికీ? బైపోలార్ డిసార్డరా? కాదు కాదు. లేదు.. నేను మామూలు మనిషిని. ఎస్ అయామ్ ఆ నార్మల్ హ్యూమన్బీయింగ్ ... అంతే!

కదల్దేం ఈ ముండ ఇంకా నన్ను దయ్యాన్ని చూసినట్టు చూస్తుందేం ...

చట్టుక్కున లేచి నిలుచున్నా. నాతోపాటు ఎగిరిన నా బొజ్జ లొడలొడా ఊగింది.

వికృతుడూఁ ... వికృతుడూఁ ... డూఁ ... డూఁ ... డూఁవ్ ... డూఁవ్ ...

కోపంగా వెనుతిరిగి చూశా.

డోర్ కర్టెన్కి నేనంటే భయం వేయలే. హైబాయ్‌కీ భయం వేయలే. గాలికీ భయం వేయలే.

మరి దీనికెందుకూ భయం?

"లే! నిన్నేం చంపేస్తున్నానా అట్లా చూస్తున్నావ్? వాణ్ణెందుకు పంపించావనడిగానంతే! లే, పైకి లే!" హుంకరించా.

"ఎవరిని?" విస్మయంగా అడిగింది.

"వాడే... పిచ్చి డాక్టర్ ... సీతాపతిగాడు. వాడికి నేనా రైల్వేక్వార్టర్స్ దగ్గర కూచుంటానని ఎట్లా తెల్సింది? నీకూ వాడికీ మధ్య క్లేర్వాయంట్ లింకేమైనా ఉందా? నువ్వు చెప్పకుండా ఆ గాడ్దెకొడుక్కి ఎట్లా తెల్సింది? చెప్పు, చెప్పూ!"

"సీ... సీతాపతా! నిజం ... నాకేం తెలీదు. సీతాపతిగారితో నేనేం చెప్పలా! నిజం. ప్లీజ్... బిలీవ్మీ ... మీరూహించుకుంటున్నారంతే!"

"అంటే? నాకు ఊహల్తప్ప వాస్తవాల్తెలీవనా నీ బోడి ఉద్దేశం?" చెయ్యి దొరకబుచ్చుకోడానికి ప్రయత్నించా ... చురుగ్గా తప్పుకుంది మల్లిక.

పాముా ... ముంగిసా ...

బుస్... హిస్‌హిస్స్...స్స్...

వంకీ తిరిగిన కోరలు... పగడాల కళ్ల గుళ్లు.

పొలుసులు పొలుసులు ... మెత్తటి కుచ్చుల బొచ్చు.

పామేదీ? ముంగీసేదీ?

డూవ్... డూవ్... డూవ్...

కోపంగా తిరిగి చూశా.

'కర్టెన్ ... హైబాయ్ ... ఆట'

నాలుగడుగులు పరుగెత్తి గబాల్న కర్టెన్ని దొరకబుచ్చుకున్నా. కుచ్చుగా చేసి రెండుచేతుల్నిండా పట్టుకుని దానివేపు చూశా. నా చేతుల పట్టుదగ్గర సన్నగా అయ్యి. పైనా కింద విడిగా విప్పారి ఇసుక గడియారం ఆకారంలో ఉంది కర్టెన్. పైన వికసించిన రొమ్ములూ ... మధ్యన్నడుమూ ... మళ్లీ కింద విడిగిన జఘనం ... భలే భలే ... థర్టీసిక్స్, ట్వెంటీఫోర్, ఫార్టీసిక్స్ ... సెక్స్ ... అదుగో మళ్లీ ఎరోటిసిసమ్ ... ఇసుక గడియారం ... ఆడదా?

ఛావు! ఛావు ముండా! బలంగా గుంజా. రింగులు తెగి నా కళ్లముందు కుప్పకూలిన తెర.

అదెందుకూ ఇట్లా నా కాళ్లమీద పడదూ? పడాలి! పడాలి! యావత్ప్రపంచమూ నా కాళ్లమీద పడాలి - కుప్పకూలిన ఈ ముష్టి కర్టెన్లాగా.

వెనక్కు తిరిగి చూశా.

మోచేతి పైభాగాన్ని నిమురుకుంటూ నావంకే చూస్తోంది మల్లిక. నీడగా, జాలిగా. ఆమె వెనక గోడకి తాపడం చేసిన 'కాస్మిక్ డాన్స్' మసక రంగుల్లో 'మధు డాంగే' సృజన తక తరికిటి నక ఝణు తధింగిణతోం ... నాధిర్ దిర్తా నాధిర్ దిర్తా.... ధిరక్ ధిరక్!

ఎప్పుడో వెనకాల చీకటికాలం మొదట్లో పదివేల మిలియన్ల ఏళ్లక్రితం కారణం తెలీని విస్ఫోటం జరిగి 'భా...ం' అతి పురాతన వాయువుల్ని భూనభోంతరాళాల్లో నింపి...

గామోహాట్ బిగ్ బాంగ్ ... టెన్ థౌజండ్ మిలియన్ డిగ్రీస్ అబ్సొలూట్ టెంపరేచర్.... కణకణకణ నిప్పులు చెరిగీ ఝణఝణఝణ డప్పులు మోగే కాలం. విశ్వభావ నృత్యం ... శివ శంకర హర నటరాజా ... కాస్మిక్ డాన్స్ ... కల్పం ... బ్రహ్మగాడిరోజు నాల్గువేలా ఇరవై మిలియన్ల కాలం ...

వద్దు వద్దూ!

ఆ నేపథ్యంలోంచీ ... ఆ పురాతనత్వపు సత్యాల నకళ్ల నేపథ్యంగా మల్లిక ఇప్పుడు ఈ క్షణం నా వాస్తవాల ప్రస్తుత సత్యం ... స్త్రీ.

కాళ్లు బలహీనమౌతున్నాయి.

కళ్లవెంబడి నీళ్లు కారుతున్నాయి.

కుప్పకూలిన కర్టెన్ పక్కనే తలుపుకానుకొని కూచుండిపోయా.

* * *

"ఆ పందిపిల్ల మడ్డి కడిగి వస్తున్నా. అయినా ఇంత వికారప్పుట్టుక నేనింతవరకూ చూళ్లేదే! అయినా అవేం చెవులూ ముక్కులే ... చూడు చూడు అచ్చుగుద్దినట్టు ... ముట్టె ముందుకొచ్చీ ... ఛీ! ఛిఛీ!"

నాలుగేళ్ల పిల్ల నేను. నాకూ లోకం తెలుస్తుందనీ, నాకూ జ్ఞానమొచ్చుంటుందనే జ్ఞానం లేని పెద్దత్త భాగ్యలక్ష్మి నామీద చూపిన ఏహ్యతని మౌనంగా భరించిన నేను ...

నా పుట్టుక నా చేతుల్లో లేదే ... తెలియనితనం.

"నాయనా విష్ణుమూర్తీ! నీకు నమస్కారం. పక్కకు తప్పుకో!" మానేజరు వెంకోబరావు చమత్కారాలని అర్థం చేసుకోలేని జ్ఞానశూన్యత.

ఇంటిదగ్గర నెమిలీకను పట్టుకున్నంతగా సున్నితంగా, పాదరసాన్ని అరచేతిలో పట్టుకున్నంతగా జాగ్రత్తగా మోసి పార్కులో అమేధ్యం చుట్టిన కాయితప్పొట్లాన్ని విసిరినట్టు విసిరేసే పనివాడు నారాయణ.

అసహ్యంగా పుట్టి అసహ్యంగా పెరిగి రోజుకో కొత్త ఉపమానం రోజుకో వీసం పెరిగే రోత ...

... అలసిపోయి, మకిలిపట్టిన బుగ్గలు కన్నీళ్ల బురద కుప్పలయితే ...

సీసాలో రంగు ద్రావకం ... గ్లాసూ గ్లాసూ గొంతులో పోసుకుంటూ, మెలితిరిగిన మీసాలు తుడుచుకుంటూ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఇంట్లో కూడా ... డీఐజీనే.

"యాయ్... ఈ లంజెకొడుకు నిజ్జంగా ... నాకే పుట్టినాడంటావేమే, నీలవేణీ! మా ఇంటా వంటా లేవు గదే! ఈ పురుగు పోలికలూ ... ధూత్!'

పురుగు తండ్రి ... ఇంకో పురుగు.

కాలమే కరుణించిందో ప్రకృతి ప్రసాదించిన వికృతికి పరిహారంగా ప్రకృతే నాకు లక్షల ఆస్తిని, తండ్రి అనబడే వ్యక్తి మరణం రూపేణా ప్రసాదించింది.

అడుగు తీస్తే కసి.

అడుగు వేస్తే కసి.

అటు తిరిగితే రోత.

ఇటు తిరిగితే జుగుప్స.

శ్రీమహాలక్ష్మి తెచ్చిచ్చిన సుఖాలు ... నరకాలై

పై గదిలో కిటికీలు లేని గదిలో శబ్దాలు చేరని గదిలో ... నన్ను ప్రేమించే అక్షరాల మధ్య ... నేను రమించే కావ్యాల నడుమ ...


నేను విసిరేస్తే విసరబడే వాయులీన రాగాల దైన్యంతో కసికసిగా బిగతీసిన తీగలమీద కమానును రాస్తూ ఆ ఒరిపిడిలో చిట్లిన స్వరాల రవ్వలు నా స్వాంత ఏకాంత లోకాల తిమిరాన్ని కాంతిమంతం చేస్తూ వర్ణహీనమైన బతుకు కాన్వాస్మీద ఊహల సహస్ర వర్ణాలు అద్దుకుంటూ నేను సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ... సామ వేద గమకాలూ, కాంతి సాంద్రత కొలిచే యత్నాల్లోంచీ ఆర్చిడ్స్ కోసం నే కట్టుకున్న గ్రీన్హౌస్ నీడల్లో జీవిస్తున్న తరుణంలో అప్పుడు హేమంత తుషారంలాగా...

బయొలాజికల్ స్టడీ అని తారసిల్లిన మల్లిక.

బేలగా జాలికళ్ల మల్లిక.

ఆచి తూచి కొలిస్తే ముల్లుపోని ఆడతనం మల్లిక. భయం భయంగా నా శరీరమూ మనసూ

ఊ రెండూ చేతుల్చాస్తే అందుకుని జీవితపు



## రక్షణకో కొత్త మార్గం!



అమెరికాలో నేరాల సంఖ్య అధికం. ముఖ్యంగా నీగ్రో ఆడపిల్లల్ని ఎత్తుకెళ్లి రేప్ చేసి చంపడం నానాటికీ అధికం అవుతోంది. రాత్రిళ్లు కార్ పార్క్‌కి ఒంటరి ఆడవాళ్లు తమ కార్ల దగ్గరకి వెళ్లడానికి కూడా భయపడుతున్నారంటే అది ఎంత జటిల సమస్యో అర్థమవుతుంది. ఈ సమస్యకి మిస్ జూలియన్ కనిపెట్టిన పరిష్కారం, కూడా ఆకలిగా ఉన్న పులిపిల్లని వెంట తీసుకెళ్లడం. కుక్కకన్నా పులిపిల్ల ఎఫెక్టివ్‌గా మనిషిని గాయపరుస్తుంది (చంపకుండా). ఆ శిక్షణ ఇవ్వబడ్డ పులిపిల్లలకి ఇప్పుడక్కడ డిమాండ్ ఏర్పడింది.

\- డి. పద్మజ

అతిపెద్ద అసహ్యం ... దారిద్ర్యం నుంచీ నా వైభవాల జుగుప్సల్లోకి దూకేసిన మల్లిక.

ఈ మల్లికనా హింసిస్తున్నది?

నెమ్మదిగా లేచా. భయంగా ఆమెవేపు చూశా. నెమనెమ్మదిగా అడుగులో అడుగేస్తూ నావేపు వచ్చి,

"పదండి, ప్లీజ్! పడుకోండీ!" నా భుజంమీద మంచుహస్తం. అతి వేగంగా నా చర్మంకింద ప్రవహిస్తున్న రుధిర స్రోతస్వినిలు ఘనీభవించి ...

"వేసుకోండి" చేతిలో రెండు నైట్రోజోపామ్ మాత్రలూ, గ్లాసులో నీళ్లూ.

ప్రవహిస్తున్న మురుక్కాలువ పక్క ఘనీభవించిన శాద్వలసదృశంగా మల్లికనబడు స్త్రీ.

* * *

వెన్నెల తునకలు తునకలుగా పక్కమీద పడుతోంది. హేమంతాన్ని కౌగిలించుకుని ముక్కలు చెక్కలై పడున్న వెన్నెలకు నా స్పర్శకు అందని స్నిగ్ధత్వమేదో ఉంది. మెల్లిగా నిమిరా. బెడ్ స్ప్రెడ్ శాటిన్ స్పర్శ కాదా అది? కాదు కాదు వెన్నెలదే.

ఏదో ఒక అజ్ఞాత పరిమళమున్నట్టుంది ఈ వెన్నెలకు.

మొహానికి వెన్నెల పరుచుకొనేలా సర్దుకుని పడుకున్నా. గాలి గుండెల్నిండా పీల్చుకున్నా. నా వంటినిండా వెన్నెల వ్యాపించిన భావన. దూరంగా తీతువు కూస్తూ వెళ్లిపోయింది.

"థూ! థుథుథూ! అశుభం అశుభం...!"

ఆక్రోశాలు, నిట్టూర్పులూ, ఉద్వేగాలూ, బుసలూ సెగలూ, పెనుగులాటలూ, పైథాగరస్ పైకోణం నుంచీ తొంగి చూసిన నా మిడిగుడ్లలో దూరిన సభ్యనాగరికుల మృగచేష్టల నీడల దృశ్యాలు ...

అడుగుల్లో తడబాట్లు.

తప్పటడుగులూ, తప్పటడుగులూ.

శరీరానికీ నరాలకీ వంతెన వేసే ప్రాకృతిక సుఖభావన ...

నేనూ మనిషినే.

ఆఫ్టరాల్ అయామె హ్యూమన్బీయింగ్.

ఎస్... నో...!

కాల్పనిక జగత్తుల్లో మార్మిక రచనల్లో మరో చిత్రం.

వెడల్పాటి చెవులూ, ముందుకొచ్చిన మూతీ, మిడిగుడ్లూ ... సాలిడ్ స్టేట్ ఫిజిక్స్‌లో పి.హెచ్‌డీ ... డాక్టర్! డాక్టర్ ... బట్టతల డాక్టర్! మేలు మేలు అలోపేషా యూనివర్సాలిస్ లేదు ... మొత్తంగా నున్నగా కుబుసం విడిచిన బురదపాములాగా ... యాక్... యాక్! యా...యా...!

"యా... యువార్రైట్!" అదే సరైందా? ఆ ఉపమానమే సరైందా?

"అవునవును. అదే నేనంటున్నా."

అంటే ఆలోచనలున్న మృగాన్నా నేను?

"ఎస్!"

"యూ బాస్టర్డ్!" పెద్దగా అరిచి, లేచా.

ఒళ్లంతా చెమటలు... గదినిండా వెలుగు. ఎదురుగా సీతాపతీ, మల్లికా - నన్నే చూస్తూ.

"ఎస్... యు వా రైట్! ఇదే క్షణం మీరు మానసిక స్థిమితం కోల్పోకూడదు!" మల్లికతో అని, నా దగ్గరగా వచ్చాడు సీతాపతి.

"డాక్టర్! కల కంటున్నట్టున్నారు. చూడండి, నేనూ ... సీతాపతిని. దిసీస్ యువర్ వైఫ్!"

కలా? కల ..! కలకల ... జలజల ... జలపాతం ... అంతు తెలీని పాతాళంలోకి దూకే పెద్ద జలపాతం పైనుంచీ దూకుతోన్న భావన.

ఎంతకూ అడుగు తగల్దేం?

మల్లికెందుకు నిస్సహాయంగా చూస్తోంది?

దిస్ హోల్ వరల్డ్ ఈజ్ గోయింగ్ టు ఎ హోల్ అని అరవాలనుంది. అంతా ... అందరూ ... అలికినట్టె నీడలు నీడలుగా మారి కరిగి, ద్రవాలై ప్రవహిస్తూ ... అదుగో ఏదో మహాబిలం ... చిమ్మటి చీకటి. అందులోకి వెళ్లిపోతున్నారు. అందరూ ... అన్నీ .... మధుడాంగే అఖిలాండ నాట్యం. సీతాపతీ, సోఫా, డ్రెస్సింగ్ టేబుల్, పిచ్చుకలూ, తోటలూ ... అందరూ... అన్నీ కరిగికరిగి ప్రవహిస్తూ ఆ చీకటి బిలంలోకి. నా చేతులు కరుగుతున్నాయి. మల్లిక జలజలా రాలిపోతోంది. అదుగో అదుగో ... అదే ... ముట్టె ముందుకొచ్చీ ... కరుగుతోంది. మిడిగుడ్లు కరిగిపోతున్నాయి. బుట్ట చెవులూ ప్రవహిస్తున్నాయి. నేను వెళ్లనందులోకి. ఆ బిలంలోకి ... వద్దు! చీకటి ... నేను కరగను! ఆ చీకటి గుహలోకి ప్రవహించను. వద్దు వద్దు! వద్దు.... మ...మ... మ..ల్లి....కా! ప్లీజ్ ... సేవ్మీ...!

"నేను చెప్పాను మీకు ... ఏది ఏమైనా అతనూ మనిషే" సీతాపతి ఆ చీకటి బిలంలోంచి తల బైటికి పెట్టి నిర్మలంగా నవ్వుతూ అన్నాడు.